క్లుప్తంగా

ఘనంగా ప్రతిష్ఠా కార్యక్రమాలు



వినుకొండ (నూజెండ్ల): నియోజవర్గ ఒడియా రాజుల సంఘం ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్ కొండ వద్ద నూతన దేవాలయం శ్రీ అంకమ్మ గుడి ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో శుక్రవారం నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించి గుడిలో అమ్మవారి ప్రతిష్ఠ, పోతురాజు ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపా రు. కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, కుంచల తిరుమల బాబు, తన్నీరు సంతోష్, గుంజి శ్రీను, తన్నీరు వెంకయ్య, ధర్మవరపు సత్యం, వేముల శ్రీనివాసరావు, బత్తుల సురేష్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ నగర్ (మసీద్ మాన్యం) లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ షేక్ దస్తగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా కాలనీలో పేదలు నివసిస్తున్నారని, విద్యుత్, తాగునీరు, సైడ్ కాలువలు, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మారుతీ వరప్రసాద్, సంద్రపాటి సైదా, బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, వెంకటేశ్వర్లు, రామారావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కవి, రచయిత 'అచ్చుల కు స్ఫూర్తి పురస్కారం

రొంపిచర్ల : మండలంలో సంతగుడిపాడు గ్రామానికి చెందిన సాహితీవేత్త, కవి, రచయిత 'అచ్చుల వెంకట సుబ్బారావు' స్ఫూర్తి పురస్కారానికి ఎంపికైనట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులో బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్, విశాఖ సంస్కృతి మాస పత్రిక వారు ఈ నెల 8న నిర్వహించే సభలో స్ఫూర్తి పురస్కారం అందుకోనున్నానని అన్నారు. ఇప్పటి వరకూ కథ, కవిత, నాటిక, పాట మొదలైన సాహితీ ప్రక్రియల్లో రచనలు చేసి, 8 పుస్తకాలు ప్రచురించి నందుకు, వందకు పైగా వివిధ సాహిత్య ప్రక్రియ పోటీల్లో బహుమతి పొందినందుకు ఈ పురస్కారానికి ఎంపికై నట్లు ఆయన తెలిపారు.

టూటౌన్‌లో డీఎస్పీ వార్షిక తనిఖీలు

నరసరావుపేటటౌన్: టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ కె. నాగేశ్వరరావు శనివారం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను సీఐ హైమారావును అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారంలో దృష్టి సారించాలని సీఐకు సూచించారు.

టీచర్లు లేరు.. పాఠాలు ఎలా?

మెగా సమావేశంలో తల్లిదండ్రుల ఆగ్రహం

నరసరావుపేట రూరల్: టీచర్ల సమ్మెలో ఉండటంతో సిలబస్ పూర్తికాక తమ పిల్లలు తీవ్రంగా నష్టపోతున్నారని గిరిజన బాలుర గురుకుల పాఠ శాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పాఠ శాల ప్రిన్సిపల్ జీ.వీరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. గత 20 రోజులుగా టీచర్ల సమ్మె కారణంగా తరగతులు జరగక పోవడంపై తల్లిదండ్రులు ప్రశ్నించారు. పది పరీక్షలు దగ్గరకు వస్తున్నా యని ఈసమయంలో సిలబస్ పూర్తికాకపోతే తమ పిల్లల భవిష్యత్ ఏమిటని నిలదీశారు. ప్రిన్సిపల్ వీరయ్య విద్యార్థులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అయితే ఉదయం 10 గంటలకు సమావేశం అని చెప్పడంతో తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు సమావేశానికి వస్తున్నారంటూ సమాచారం రావడంతో మధ్యాహ్నం 12.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపన్యాసాలతో కాలక్షేపం చేశారు. కలెక్టర్‌కు రావడం లేదని చెప్పడంతో అప్పుడు సమావేశాన్ని ప్రారంభించారు. మూడున్నర గంటలపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశం కోసం షామియానాల్లో వేచి ఉండాల్సి వచ్చింది.

ఇంకెన్నాళ్లు ఇన్‌చార్జ్‌ల పాలన!?

- అందుబాటులో ఉండని మండల పరిషత్ ఇన్‌చార్జ్‌లు
- కుంటుపడుతున్న మండల అభివృద్ధి పనులు!
- ఫోన్ చేస్తే అస్సలు స్పందించరు!



మండల పరిషత్ కార్యాలయం

బొల్లాపల్లి: కొన్నేళ్లుగా మండల పరిషత్ పరిపాలన ఇన్‌చార్జ్ పాలనలో కొనసాగుతోంది. ఇన్‌చార్జ్ అధికారులు అందుబాటులో లేకపోవడం, ఫోన్‌కు స్పందన లేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల ఈవోపీఆర్‌డీ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో షేక్ జిలానీబాషా సస్పెండ్ కావడంతో ఈపూరు ఎంపీడీవోకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా ఈవోపీఆర్‌డీ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోలు సైతం ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఇటీవల విధుల పట్ల సస్పెండ్‌కు గురి కావడంతో ఏఈఈ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.

మూగచింతలపాలెం పంచాయతీ సెక్రటరీకి ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ బాధ్యతలు అప్పగించారు. మండలంలోని పలు పంచాయతీల నుంచి సర్పంచ్‌లతో పాటు పలు రకాల పనులకు వచ్చేవారికి అధికారులు అందుబాటులో లేకపోవడంతో నిరుత్సాహం వ్యక్తం చేసి పనులు జరగక కుంటు పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. రాజకీయ కారణాలతో గత కొన్నేళ్ల నుంచి మండల పరిషత్ కార్యాలయ పనితీరు ఇన్‌చార్జ్‌ల పాలనలో కొనసాగుతోందని, రెగ్యులర్ అధికారులను నియమించాలని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ఇన్‌చార్జిల పాలనలో పనులు నత్తనడకన నడుస్తున్న పరిస్థితిని ఉన్నతాధికారులు దృష్టిసారించి రెగ్యులర్ అధికారులను నియమించాలని కోరుతున్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధిస్తేనే మేలు

జిల్లా వ్యవసాయాధికారి మురళీ



నాదెండ్ల పీఏసీఎస్‌లో మిర్చి రైతులతో మాట్లాడుతున్న మురళీ

నాదెండ్ల: తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొంది రైతులు ఆర్థికంగా బలపడితేనే వ్యవసాయరంగం బాగుంటుందని జిల్లా వ్యవసాయాధికారి ఐ మురళి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల పీఏసీఎస్‌లో ఫ్యాక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో మిరప పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గుంటూరు కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి, కంపెనీ జనరల్ మేనేజర్ స్టాలిన్ రాజు, జోనల్ మేనేజర్ కె రాఘవేంద్ర, స్థానిక ఏవో హరిప్రసాద్, ఉద్యానవనశాఖ అధికారి విశాల్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మురళి మాట్లాడుతూ మిరపలో బొబ్బర తెగులు ప్రధాన సమస్య అని, దీన్ని నివారించినపుడే అధిక దిగుబడి సాధ్యమౌతుందన్నారు. తెగుళ్ళనివారణకు రైతులు మేలిరకమైన విత్తనాలు ఎంచుకొని సాగుచేయాలన్నారు. శాస్త్రవేత్త గంగాదేవి మాట్లాడుతూ మిరపలో తెగుళ్ళు రాకుండా తీసుకోవాల్సిన సమస్యరక్షణ చర్యలను వివరించారు.

నేడు ఎన్ఎంఎంఎస్ పరీక్షలు

శావల్యాపురం: నేడు జరగనున్న జాతీయ ప్రతిభ పురస్కార్ వేతనాలు పరీక్షలకు (ఎన్ఎంఎంఎస్) స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 8వ తరగతి విద్యార్థులు 34 మంది హాజరు అవుతున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డపాటి విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈపరీక్షల్లో ఎంపికైనా విద్యార్థులకు ఒక్కో సంవత్సరం రూ.12 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తుందన్నారు. నాలుగు సంవత్సరాలు పాటు ఉపకార వేతనాలు మంజూరు అవుతాయన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి



గణపవరం శివనాగేంద్రస్వామి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



విప్పర్లలో ప్రత్యేక అలంకరణలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

నాదెండ్ల: గణపవరం – నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న శివనాగేంద్ర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే పుట్టలో వార్లు పోసి ప్ర త్యేక పూజలు నిర్వహించారు. పృథ్వీ పూజ, అష్టోత్తర శతనామాలు, గోత్రనామ పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మహాప్రసాదాన్ని నివేదించి వితరణ చేశారు. రాత్రి గణపవరం శివనాగేంద్ర స్వామి భజన సమాజం వారిచే భజనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆలయంలో 5, 7 వారాలు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇతర ప్రాంతాల నుంచి కూడా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కోండ్రు సాంబశివరావు, మాటూరి సుధాకరరావు, సింగు సత్యనారాయణ, మధుసూదనరావు, పూర్ణచంద్రరావు, సిద్దు హనుమంతరావు ఉన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి

రొంపిచర్ల: మండల ప్రజలు శనివారం సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి నిర్వహించుకున్నారు. శివాలయాల్లో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రోజు సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సేవిస్తే సకల దోషాలకు నివారణ కలుగుతుందని భక్తుల నమ్మకం. మండలంలోని విప్పర్ల, వడ్లమూడి వారిపాలెం, రొంపిచర్ల, బుచ్చిబాపన్న పాలెం, మాచవరం, కొత్తపల్లి, సంతగుడిపాడు, పరగటిచర్ల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు.

విద్యార్థుల భవిష్యత్ కోసం కృషి చేయాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

ఈపూరు (వినుకొండ): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలని ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం ఈపూరు మండలం ఇనిమెళ్ళ గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సారథ్యంలో అన్నీ ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించుకోవటం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి, విద్యా ప్రమాణాలు స్థాయి మరింత మెరుగుపరిచి నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకోవల్సిన విధి విధానాలపై పేరెంట్స్ ఉపాధ్యాయులు చర్చించుకోవాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనపై నిరంతరం తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటిపర్తి మార్తమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగప్రసాదు, ఎంఈవో-2 రామ తులసి, సీడీపీవో పి.అరుణా,మండల ప్రత్యేక అధి కారి వెంకట రామిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ రాంబాబు, అంజిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల సమావేశాలు



శావల్యాపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న విజయలక్ష్మి



అతిథుల కోసం వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

శావల్యాపురంలో...

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఉండాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు.శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ బెజవాడ వెంకట నాగేశ్వరరావు అధ్యక్షత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావన్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు, మండల వైద్యాధికారి రావిపూడి రమ్య, పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో....

బొల్లాపల్లి: మండలంలోని పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో మండల ప్రత్యేక అధికారి బి.రవికుమార్, ఎంఈవో -2 కె.పార్వతి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోట్లూరులో...

శావల్యాపురం: మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఉన్ననటువంటి సృజనాత్మకతను వెలికితీయటానికి దోహదపడతుందని ప్రభుత్వ ఛీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నా రు. శనివారం మండలంలోని పోట్లూరు గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల్లో మెగా పేరెంట్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోపూరి జ్యోతి, వైస్ ఎంపీపీ నంబూరి ప్రభావతి, పాఠశాల విద్యా ప్రదాత గడుపూడి వెంకటరాయుడు, మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి,ఈవోపిఆర్‌డి పి. సుగుణ, ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్న పూర్ణమ్మ, ఎంఈవోలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యడ్లపాడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్ మీటింగ్ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో రంగోలి పోటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులను ఒకే వేదికపై ఉంచి పాఠశాల ప్రగతి, బోధన తీరు, విద్య ఆవశ్యకత గురించి హెచ్‌ఎంలు వివరించారు. బోయపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్ మీటింగ్‌కు మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో ఎస్ ఎంసీ ప్రతాప్, వైస్ చైర్మన్ సుశీల, పోలీసు అధికారి పీవీ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాదెండ్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. విద్యార్థులు చదువుతున్న తీరు, వారి సామర్థ్యాలను తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలలో వసతులు, బోధనా పద్ధతులు, ఇతర కార్యక్రమాలపై వివరించారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల స్థల దాత మున్నంగి శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ కె.సుబ్బారావు, ఎక్స్ అఫీషియో మెంబర్ జంపని శ్రీనివాసరావు, హెచ్‌ఎం కృష్ణానాయక్, మాజీ పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా పేరెంట్స్ మీట్ ఏర్పాటుపై పలువురు తల్లిదండ్రులు దీనిపై పెదవి విరిచారు. సోమవారం నుంచి 1-9 తరగతుల విద్యార్థులకు హాఫ్‌ఇయర్ పరీక్షలు ఉండగా, శనివారం సమావేశాల ఏర్పాటుతో విద్యార్థుల ప్రిపరేషన్‌కు ఆటంకమని పేర్కొంటున్నారు. మరికొద్దిరోజుల్లో క్రిస్మస్ సెలవులు ఉన్నందున, అప్పుడు ఇలాంటి సమావేశాలు పెడితే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. పురపాలక సంఘం పరిధిలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు పాల్గొని మాట్లాడారు.

చిలకలూరిపేట: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు పాటించాలని అర్బన్ సీఐ పి.రమేష్ చెప్పారు. పట్టణంలోని భారతరత్న ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు జీవితాలను విచ్ఛిన్నం చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, పట్టణ ఎస్ఐలు రహంతుల్లా, శివరామకృష్ణ పాల్గొన్నారు.

పసుమర్రులోని మద్ది కామయ్య జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ మద్ది వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు అవసరానికి మించి సెల్‌ఫోన్ వినియోగించరాదని వెల్లడించారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: ప్రభుత్వం కల్పిస్తున్న మౌళిక సదుపాయాలన్నిటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ శనివారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ బండి నిర్మల, మండల ప్రత్యేక అధికారి సూర్యప్రకాష్‌రెడ్డి, ఎండీవో మాధ్యు బాబు, ఎంఈవోలు హవీలా, ధరణికోట బ్రహ్మేశ్వర రావు, ప్రిన్సిపాల్ రవినాయక్, ఆయా పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రొంపిచర్ల మండలం వి రెడ్డిపాలెంలో స్కూల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



గణపవరంలో విద్యార్థి తల్లికి హోలిస్టిక్ కార్డు అందిస్తున్న ఉపాధ్యాయురాలు



బీఆర్‌ఐజీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న అర్బన్ సీఐ పి.రమేష్

ఇండస్ట్రియల్ శిక్షణకు జేఎన్‌టీయూఎన్ విద్యార్థులు



పరిశ్రమ సందర్శనకు బయలుదేరిన మెకానిక్ విద్యార్థులు

నరసరావుపేట రూరల్: పరిశ్రమల సందర్శన ద్వారా సాంకేతిక జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు పరిశ్రమల్లో నిజ జీవిత పరిస్థితులను విద్యార్థులు తెలుసుకోవచ్చని జేఎన్‌టీయూఎన్ మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఐ.ఫణిసుష్మ తెలిపారు. కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు అనంతపురంలోని దక్షిణాది రీజియన్ ఫార్మ్‌మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్స్టిట్యూట్ సందర్శనకు శనివారం బయలుదేరి వెళ్లారు. ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు ఈ పర్యటన కొనసాగనుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఫణిసుష్మ మాట్లాడుతూ పరిశ్రమల్లోని ఉత్తమ విధానాలు, తాజా సాంకేతిక పరిజ్ఞానాలు, తయారీ విధానాలను అధ్యయనం చేసేందుకు ఈ పర్యటన విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు. శాస్త్రీయ, సాంకేతిక అంశాలపై మెకానికల్ విద్యార్థులు అవగాహన పొందేందుకు గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధి, కొత్త టెక్నాలజీలు, భవిష్యత్ అవసరాలపై అవగాహనను ఈ సందర్శన ద్వారా విద్యార్థులు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు

మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణ



సమావేశంలో పాల్గొన్న డీఎస్పీ వెంకట రమణ, ప్రిన్సిపల్ నాతాని, సీఐ సుభాషిణి

నరసరావుపేట ఈస్ట్: యువతను నిర్వీర్యం చేసే మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణ తెలిపారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. డీఎస్పీ వెంకట రమణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను తీసుకోవటం నిజమైన ఆనందాలకు దూరం కావటమేనని స్పష్టం చేశారు. డ్రగ్స్ వలన జీవితాలు నాశనం అవుతాయని, వారు వారి కుటుంబ సభ్యులు సమాజంలో గౌరవ మర్యాదలు కోల్పోతారని స్పష్టం చేశారు. ఒకసారి తీసుకుంటే దానికి అలవాటు పడి జీవితాన్ని కోల్పోతారని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియ చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ నాతాని మాట్లాడుతూ, తెలిసో తెలియకో ఒకసారి రుచిచూస్తే అవి తమ బంగారు భవిష్యత్ ఉన్న జీవితాలను నాశనం చేస్తాయని హెచ్చరించారు. సమావేశంలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుభాషిణి, ఎస్ఐ లేఖప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

బొల్లాపల్లి : ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలోని కృష్ణా గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి చెందిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ఆయా జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించడం జరిగిందని అధికారులు తెలిపారు. గత నెల 6వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను విచారించి అర్హత కలిగిన వారి వివరాలను డ్రాఫ్ట్ జాబితాలో ఓటర్లుగా చేర్చడం జరిగిందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలోని సదరు జాబితాను పరిశీలించుకొని అభ్యంతరాలను తెలియజేయాలన్నారు.

ఆక్రమణలు తొలగించండి

నరసరావుపేట: పట్టణంలో రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసే వారు వెంటనే స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. లేనిపక్షంలో ఈనెల తొమ్మిదవ తేదీ నుంచి ప్రణాళికా అధికారులు ఆక్రమణలను తొలగిస్తారని హెచ్చరించారు.

నరసరావుపేటలో ఘనంగా ఎస్ఎస్‌కే హోటల్ ప్రారంభం



హోటల్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: పల్నాడు రోడ్డులో నూతనంగా నిర్మించిన ఎస్ఎస్‌కే హోటల్ సెవెన్ ఇన్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు రిబ్బన్ కట్‌చేసి హోటల్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా నరసరావుపేట అన్నీరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఆతిథ్య రంగంలో ఎన్నో అవకాశాలు జిల్లాలో ఉన్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హోటల్‌లోని కాన్ఫరెన్స్ హాలును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. జిల్లా కేంద్రానికి అనువైన హోటల్ ఒకటి ఏర్పాటైందని, అతిథ్యుల ఆదరాభిమానాలతో దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. హోటల్ నిర్వాహకులు వడ్లమూడి శివరామకృష్ణ చౌదరి, కొమ్మసాని కమలాకర రెడ్డి, డాక్టర్ గడ్డం శ్రీకాంత్ రెడ్డి, గడ్డం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ అధునాత సౌకర్యాలతో రెస్టారెంట్, ఫంక్షన్‌హాలు, హోటల్ గదులు తీర్చిదిద్దామన్నారు. మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, బీజేపీ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, పట్టణానికి చెందిన పలువురు వ్యాపార ప్రముఖులు, వైద్యులు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

9న దరఖాస్తుల స్వీకారం

నాదెండ్ల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్వరలో జరిగే రాష్ట్ర శాసన మండలి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఓటు నమోదుకు ఈ నెల 9న మరోసారి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. నవంబర్ 23న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. నవంబర్ 6న స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి జాబితాను రూపొందించినట్లు తెలిపారు. పట్టభద్రులు ఓటు నమోదుకు దరఖాస్తులు అందించాలని, అభ్యంతరాలు, తొలగింపులకు సైతం దరఖాస్తులు అందించవచ్చని తెలిపారు.

18లోగా దరఖాస్తులు అందించాలి

నాదెండ్ల: నాదెండ్ల ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు సీడీపీవో శాంతకుమారి తెలిపారు. ఈ నెల 4న నోటిఫికేషన్ విడుదలైనందున 6వ తేది నుండి 12వ తేది వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మండల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త -1, సహాయకులు -12 పోస్టులుఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాసై ది.01.07.2024వ తేది నాటికి 21 సంవత్సరాలు నిండిన వారు అర్హులన్నారు. స్థానికంగా నివశిస్తూ వివాహితురాలైన మహిళలు ఈ నెల 18వ తేది సాయంత్రం 5 గంటలలోపు నాదెండ్ల ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

